ప్రజాశక్తి
శనివారం 15 జులై 2023 5 అనంతపురం






రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొన్న నాయకులు

ముందు'సాగు' అయ్యేనా..!

◆ కారుమబ్బులు కమ్ముకొస్తున్నా...కురవని వానలు
◆ 18 మండలాల్లో వర్షాభావం
◆ ఇప్పటికి సాగు ఆరు శాతమే



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆకాశం నల్లగా కమ్ముకుని రావడం... వర్షం చినుకులు వస్తాయని ఆశపడడం. ఇంతలోనే ఈదురుగాలులకు మేఘాలు మాయమవడం ఇది అనంతపురం జిల్లా వ్యాప్తంగా గత నెల రోజులుగా వాతావరణంలో జరుగుతున్న మార్పులు. కమ్ముకొచ్చిన మేఘాలు చినుకు రాల్చకముందే తరలిపోతున్నాయి. మేఘాలు ఆవిరివుతున్నట్లే ఈ ఖరీఫ్ ఆశలు కూడా రైతులకు ఎగిపోతున్నాయి. విత్తనం విత్తుకునేందుకు జులై మాసమే సరైంది. కాని ఇప్పటి వరకు జిల్లాలో సగానికి పైగా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సాగు కూడా పది శాతంలోపే ఉంది.

ఆరు శాతంలోపే సాగు

అనంతపురం జిల్లా పరిధిలో సాదారణ సాగు విస్తీర్ణం 9.15 లక్షల ఎకరాలుంది. ఇందులో ఇప్పటి వరకు సాగైంది చూస్తే కేవలం 50,699 ఎకరాలే. అంటే మొత్తం సాగు విస్తీర్ణంలో ఆరు శాతం వరకే పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా సాగయ్యే వేరుశనగ పంట మూడు శాతం వరకుంది. వేరుశనగ సాధారణం జిల్లాలో 7.69 లక్షల ఎకరాలయితే 19 వేల ఎకరాల్లో ఇప్పటి వరకు విత్తనం పడింది. ఆ తరువాత అత్యధికంగా సాగయ్యే ఆముదం, పత్తి పంటల పరిస్థితి ఇంచుమించు ఇదే రకంగా ఉండటం గమనార్హం. పత్తి సాధారణ సాగు 1.27 లక్షల ఎకరాలయితే, సాగైంది 21 వేల ఎకరాలు. ఆముదం సాధారణ సాగు 30 వేల ఎకరాలవుతే 3160 ఎకరాల్లో విత్తనం పడింది. కంది పంట 74 వేల ఎకరాలకుగానూ 160 ఎకరాల్లో విత్తనం పడింది. ఇలా అన్ని రకాల పంటల సాగు నామ మాత్రంగానే ఉంది.

18 మండలాల్లో వర్షాభావం

అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 31 మండలాలుంటే 18 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. ఇందులో మూడు మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 77.6 మిల్లీమీటర్లు కురావాల్సి ఉండగా 60 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 22 శాతం తక్కువ వర్షపాతం ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదయింది. ఇందులో చూసినప్పుడు కళ్యాణదుర్గం, బొమ్మనహళ్, విపడకనల్లు మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. బొమ్మనహళ్ మండలంలో సాధారణ వర్షపాతం 68.6 మిల్లీమీటర్ల కురవాల్సి ఉండగా 26.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 61.1 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. విడపనకల్లులో 96.9 మిల్లీమీటర్లకు పడాల్సి ఉండగా 30.3 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఇక్కడ 68.7 శాతం వర్షపాతం లోటుంది. ఇక కళ్యాణదుర్గంలో 79.4 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం పడాల్సి ఉండగా 26.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది. ఇక్కడ కూడా 66.5 శాతం తక్కువ వర్షపాతం పడింది. ఇవి కాకుండా మరో 15 మండలాల్లో వర్షపాతం లోటు 20 శాతం కంటే ఎక్కువగా ఉంది. ఈ ప్రభావం పంటల సాగుపైనా పడుతోంది. పదును కాకపోవడంతో రైతులు విత్తనాలు వేసుకోలేని పరిస్థితుల్లోనున్నారు. ఈ వారంలో అయినా ఓ మోస్తరు వర్షాలు పడతాయో అన్న భావనంలో రైతులు ఆశగా మేఘం వైపు చూస్తున్నారు.

ముగిసిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

పలు అంశాలపై తీర్మానాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఈనెల 12న అనంతపురం నగరంలోని తపోవనం వద్దనున్న రేడియెంట్ ఫంక్షన్ హాలులో ఈ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. రాష్ట్రంలోని ముఖ్య నాయకులందరూ ఇందులో పాల్గొన్నారు. వీరితోపాటు సిపిఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ. బేబిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. సమావేశాల్లో రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులతోపాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ, కార్మిక సమస్యలపైనా మూడు రోజుల పాటు సమావేశాల్లో చర్చించారు. వీటిపై పలు తీర్మానాలను సైతం చేశారు. ప్రధానంగా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగానున్న యూనిఫామ్ సివిల్ కోడ్ అంశంపైనా చర్చించారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను బిజెపి మత కోణంలో అమలు చేసే ప్రయత్నం చేస్తున్నట్టు చర్చల్లో వచ్చింది. దీనిపై రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల వైఖరులను తప్పుబట్టింది. ఇప్పటికైనా ఆ పార్టీలు యుసిసిపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. అంతేకాకుండా కేంద్రం విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్న అంశం చర్చకొచ్చింది. దీనిపై సెప్టంబర్, అక్టోబర్ మాసాల్లో రాజకీయ ప్రచారోద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యపై చర్చించారు. ఇది వరకే ఈ సమస్యపై సిపిఎం నిర్వాసిత ప్రాంతాల్లో పాదయాత్రలు చేపట్టిన విషయం తెలిసిందే. నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేయడమే కాకుండా నిధులు విడుదల చేయాలని కోరుతూ పార్లమెంటు శీతాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టాలని ఈ సమావేశంలో తీర్మానించారు. పునరావసం కింద రూ.30 వేల కోట్లు విడుదల చేయాలని కేంద్రంపై ఒత్తిడి చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్వాసితుల కోసం కేంద్రంపై పోరాటం చేయాలని కోరారు. అసైన్డు భూముల అన్యాక్రాంతం అవడంపైనా ఈ కమిటీలో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసైన్డు భూములను 20 సంవత్సరాలు దాటితే అమ్ముకోవచ్చునని నిర్ణయించింది. దీనిపై రాష్ట్ర కమిటీలో చర్చించినట్టు శ్రీనివాసరావు తెలిపారు. కొంతమంది భూస్వామ్యులు, రిలయ్టర్లు అక్రమార్కులు ఐదారు లక్షల ఎకరాలను కాజేశారని ఈ భూములను పేదలకు పంచాలని అవసరమైతే భూపోరాటం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపైనా కమిటీలో చర్చించారు. ఇలా కీలకమైన అనేక అంశాలపై మూడు రోజుల సమావేశాల్లో చర్చించారు. అదే సందర్భంలో స్థానికంగా ఇతర కార్యక్రమాలను సిపిఎం జిల్లా కమిటీ చేపట్టింది. బుధవారం రోజు సాయంత్రం వామపక్ష నాయకులు, సానుభూతిపరులు, మేధావులతో సిపిఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబితో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి- కేరళ ప్రభుత్వ నమూనా' అన్న అంశంపై చర్చించారు. కేరళలో ప్రత్యామ్నాయ విధానాలను ఏ రకంగా అమలు జరపడం ద్వారా మానవ అభివృద్ధి సూచికల్లో మెరుగ్గా ఉందో బేబి వివరించారు. ఇక రెండో రోజు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇందులో బేబితోపాటు, బివిరాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ తదితరులు పాల్గొన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఈ సభలో ప్రస్తావించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. మొత్తంగా మూడు రోజుల సమావేశాలు విజయంతంగా ముగిశాయి.

గృహ నిర్మాణాల్లో పురోగతి చూపండి

కలెక్టర్ యం. గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారుల్లో అవగాహన పెంచి పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో హౌసింగ్ లేఅవుట్‌లలో జరుగుతున్న గహ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు మొత్తం ఇళ్లు 19,193 పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు 15,976 ఇళ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలిన 3,222 ఇళ్లు రెండు వారాల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న గహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నాని సూచించారు. లేఅవుట్‌లలో విద్యుత్, వీధిలైట్లు ఏర్పాట్లు, తాగునీటి వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆగస్టు మాసంలో సామూహిక గహప్రవేశాలు జరగనున్నందున హౌసింగ్ అధికారులు పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. 65 సిఎస్‌ఎంసి ద్వారా మంజూరైన 8,223 ఇళ్లకు సంబంధించి లేఅవుట్లకు మ్యాపింగ్, జియో టాకింగ్, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, హౌసింగ్ డీఈ లక్ష్మీ నారాయణమ్మ, జడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ ఎహ్సాన్ బాషా, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో-7 ఇచ్చిందన్నారు. జీవో వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా నేటికీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వకుండా కేవలం రూ.15వేలు మాత్రమే ఇస్తుండడం దుర్మార్గమన్నారు. జీవో ప్రకారం కార్మికులకు వెంటనే రూ.18,500 ఇవ్వాలని, 2011లో 9 నెలలు బకాయి ఉన్న ఇపిఎఫ్ అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి-సమాన వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్, ఇవ్వాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మహిళా కార్మికులపై ఒత్తిడి తగ్గించాలని, డిమాండ్ చేశారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికైనా కార్మిక సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బత్తల ఆదినారాయణ, ఎం.ఆది, ఎలక్ట్రీషన్లు రాయుడు, మల్లి, మురళి, ఓబుళపతి, వాటర్ వర్క్స్ గౌరీ లోకేషనప్ప, లక్ష్మయ్య, లోకేష్, సురేష్, కుళ్లాయమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమామోహన్‌రెడ్డి

సెస్ బకాయిలు వసూలు చేయండి

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ప్రభుత్వ శాఖల నుంచి గ్రంథాలయాలకు రావాల్సిన సెస్ బకాయిలు వసూలు చేయాలని సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి సంబంధిత అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెస్ బకాయిలు వసూలు చేసుకుంటేనే గ్రంథాలయాల నిర్వహణ, ఉద్యోగుల వేతనాలు, తదితర నిర్వహణలు జరుగుతాయన్నారు. కావున సమిష్టిగా పని చేసి గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే సభ్యుల సంఖ్య పెంచాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా మాట్లాడుతూ చాలా గ్రంథాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కొన్నింటికి సొంత భవనాలు లేవన్నారు. ఉద్యోగులు అందరూ భవనాల ఏర్పాటుకు స్థల సేకరణకు సంబంధిత అధికారులను, దాతలను కలిసి స్థలాలు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి మోడల్ స్కూల్ విద్యార్థులు



ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థినులు

గుత్తి : స్థానిక ఆదర్శ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎన్.ఉషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల చెందిన ఎజి.మనుజ, జి.తేజస్విని, కె.లక్ష్య ఎంసెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులై 2023-24 విద్యా సంవత్సరం సంబంధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందించారు.

జెఎన్‌టియులో పలువురికి ఉద్యోగోన్నతులు

అనంతపురం : జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జి. రంగ జనార్ధన ఆదేశాల మేరకు పలువురు బోధనా సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తూ రిజిస్ట్రార్ శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన అధ్యాపకులకు విసి రంగజనార్ధన అభినందనలు తెలిపారు.

ఆశావర్కర్ల సమస్యలపై 18న ధర్నా

ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఆశావర్కర్లు

ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఈమేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం నారాయణపురంలోని రేడియంట్ ఫంక్షన్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు పనిభారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించవద్దని, ప్రభుత్వ సెలవులుచ, మెడికల్ లీవులు ఇవ్వాలని, సచివాలయాల్లో ఉదయం 9 నుంచి 4గంటల వరకూ కూర్చోబెట్టడం ఆపాలని, పిహెచ్‌సిల్లో స్వీపింగ్ పని చేయించడం ఆపాలని, డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాలో భారీగా ఆశావర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి, ఉపాధ్యక్షురాలు మాలతి, నగర నాయకులు నీరజ, అనురాధ, సమంత, సిఐటియు జిల్లా నాయకులు గోపాల్, రామాంజనేయులు, ముర్తుజ, వెంకటనారాయణ, ఎజి.రాజమోహన్, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం



ప్రభుత్వం నూతన విద్యావిధానాల్లో భాగంగా అమలు చేస్తున్న యాప్‌ల ద్వారా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇందులో ఉన్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఫేషియల్ అటెండెన్స్, జగనన్న విద్యా కానుక, మనబడి నాడు నేడు, జగనన్న గోరుముద్ద, ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టమ్ యాప్స్‌లో సాంకేతిక లోపాలు ఉండటం వల్ల టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగనన్న విద్యా కానుక విషయంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం సరికాదని మండిపడ్డారు. జగనన్న విద్యా కానుక (జీవీకే) కడప రీజినల్ పర్యవేక్షకులు, చైల్డ్ ఇన్ఫో ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలకు వస్తారని, నిర్ణీత సమయంలోగా పూర్తిగా పంపిణీ చేయని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని యాప్స్ లో ఉన్న సాంకేతిక లోపాలను సవరించి ఉపాధ్యాయులపై ఉన్న పని ఒత్తిడిని, భయాందోళనలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

బెదిరింపులకు భయపడం

జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వైసిపి నాయకుల దాడులు, బెదిరింపులకు భయపడేదిలేదని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో ఈనెల 11న రాత్రి జరిగిన దాడిలో గాయపడిన టిడిపి నాయకులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి సంబంధించి ఎలాంటి కామెంట్స్ అవసరం లేదన్నారు. అయితే తిరిగి మేము కూడా దాడి చేయగలమని, తర్వాత తాడిపత్రి భ్రష్టు పడుతుందన్నారు. ప్రజలు ఇబ్బంది పడతారన్నారని తప్ప ఇలాంటి బెదిరింపులకు తాము భయపడమన్నారు. అనంతరం గన్నెవారిపల్లి కాలనీ, కడప రోడ్డులో పర్యటించి ఆటో డ్రైవర్లు, తోపుడుబండ్ల వ్యాపారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మిమ్మల్ని..మీపార్టీని కట్టడి చేస్తా..

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి



విలేకరులతో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

'నన్ను కట్టడి చేయడం మీతోపాటు (మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు) తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చేత కాదు.. అయితే మీతోపాటు మీ పార్టీని కూడా కట్టడి చేసే సామర్థ్యం నాకు ఉంది' అంటూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించారు. జెసి బ్రదర్స్ కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు తాడిపత్రిలో టిడిపి కార్యకర్తలపై దాడులు చేసిన రోజుల్లో తాడిపత్రికి వచ్చి ఏమైనా చేశావా.. అని ప్రశ్నించారు. తననుకట్టడి చేయాలనుకునే ముందు జెసి ప్రభాకర్‌రెడ్డి నోరు అదుపులో ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. నీవు విలేఖరిగా మొదలై అంచలంచెలుగా ఎదిగి కోట్లకు ఎలా ఎదిగామో తన దగ్గర చిట్టా ఉందన్నారు. నీవు పరామర్శించేందుకు వచ్చిన చింబిలి రమణ అక్రమాలు కూడా తన దగ్గర ఉన్నాయన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే మరోసారి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

దాడులకు పెద్దారెడ్డి బాధ్యత వహించాలి

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్



విలేకరులతో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

టిడిపి నాయకులపై వైసిపి నాయకుల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని అక్కన్నపల్లి గ్రామంలో ఈనెల 11న రాత్రి జరిగిన దాడిలో గాయపడిన టిడిపి నాయకులను మాజీమంత్రి కాలవ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రి నియోజకవర్గంలో బయోత్పాతం సృష్టించి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. గాయపడిన వ్యక్తిని పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్లిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చింబిలి రమణపై లైట్లు ఆఫ్ చేసి మరీ దాడికి పాల్పడడం దారుణమన్నారు. దాడుల్లో గాయపడిన వారిపైనే అక్రమ కేసులు పెడుతున్నారంటే తాడిపత్రిలో శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం అవుతుందన్నారు. జగన్ ప్రభుత్వం వైసీపీ గుండాలకు అనధికార లైసెన్స్ ఇచ్చినట్లు ఉందని విమర్శించారు. తాడిపత్రిలో జరిగే దాడులకు పూర్తి బాధ్యత ఎమ్మెల్యే పెద్దారెడ్డి వహించాలని డిమాండ్ చేశారు. ముందు ఎమ్మెల్యేను కంట్రోల్ చేస్తే దాడులు కంట్రోల్ అవుతాయన్నారు. దాడికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చింబిలి రమణ, రాంబాబు, గోపాల్, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ల భద్రతకు భరోసా

సత్వర బంగారు రుణాలు : అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెవెల్ మురళీధర్

ప్రజాశక్తి-అనంతపురం

డిపాజిట్ల భద్రతకు అర్బన్ బ్యాంకు భరోసాగా ఉంటుందని బ్యాంకు ఛైర్మన్ జెవెల్ మురళీధర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న అనంతపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం కో ఆపరేటివ్ బ్యాంకు 107 సంవత్సరాలుగా ఖాతాదారులు, డిపాజిట్‌దారులు నమ్మకాన్ని చూరగొంటూ ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుతం బ్యాంకు నిరర్థక ఆస్తులు ఎన్‌పిఏపై దృష్టి సారించి 27 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంలో సంస్థ ఉద్యోగులతో కలిసి ఆర్థికాభివృద్ధికి కృషి చేశామన్నారు. తమ బ్యాంకు 100 కోట్లకుపైగా డిపాజిట్లు, 700 కోట్లకుపైగా టర్నోవర్ ఉన్నట్లు వివరించారు. ఇప్పటి వరకూ 18 వేల మందికి గృహ, బంగారం, వ్యాపార తదితరులకు రుణాలు ఇచ్చిన ఘనత అర్బన్ బ్యాంక్‌కే దక్కుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, చిన్నచిన్న వ్యాపారస్తులు డిపాజిటర్లుగా ఉన్నారని రానున్న రోజుల్లో ఇంకా డిపాజిట్లు పెంచనున్నట్లు తెలిపారు. తమ ఖాతాదారులకు ఏటిఎం, ఆర్టిజిఎస్, నెఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కె.కృష్ణకుమార్, బి.రమణయ్య, డైరెక్టర్లు వడ్డే వెంకటాద్రి, చంద్రశేఖర్, విజి సుబ్రమణ్యం, చింతా భాస్కర్, గోల్డ్ బాషా, రాధమ్మ, సుంకర రమేష్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెవెల్ మురళీధర్

ఆర్డీటీ సహకారం మరువలేనిది

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి - కురుగుంటలో 630 ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

ప్రజాశక్తి-అనంతపురం

ఇళ్ల నిర్మాణాల్లో ఆర్డీటీ సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కురుగుంట లేఔట్‌లో ప్రభుత్వంతోపాటు ఆర్డీటీ సహకారంతో నిర్మించనున్న 630 ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల విషయంలో ఆర్డీటీ సంస్థ చొరవ తీసుకుని ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ గౌతమి ప్రత్యేకంగా ఆర్డీటీ సంస్థతో మాట్లాడడంతో కురుగుంటలో నిర్మాణాలకు ఒప్పుకున్నారన్నారు. జిల్లాలో ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ అనేక సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. విద్య, గృహ నిర్మాణాలకు ఆర్డీటీ ప్రాధాన్యత ఇస్తూ ఎంతో మంది ఎస్సీ, ఎస్టీలకు తోడుగా నిలిచిందన్నారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కూడా కురుగుంటలో ఆర్డీటీ సంస్థ ఇళ్లు కట్టించిందన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో గుంతకల్లులోనూ గృహ నిర్మాణాలు చేశారని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు, మహిళా సంఘాల నుంచి రూ.35 వేలు అందిస్తున్నామన్నారు. దీనికితోడు ఆర్డీటీ సంస్థ ముందుకు వచ్చి ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.25 వేలు భరిస్తోందన్నారు. అందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం కురుగుంటలో ఇళ్ల నిర్మాణాలు చేశామని గుర్తు చేశారు. నిర్మాణాలు నాణ్యతగా జరగాలంటే అందరూ సహకరించాలని కోరారు. లబ్ధిదారులు, హౌసింగ్, ఇతర అధికారులు టీంగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, మేయర్ వసీం, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మేయర్ రాగే పరశురాం, కార్పొరేటర్లు, మున్సిపల్, హౌసింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

అనంతపురం క్రైం : ఒంటరితనాన్ని భరించలేక మోహన్‌బాబు అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నగరంలోని రంగస్వామినగర్‌లో చోటు చేసుకుంది. త్రీటౌన్ సిఐ ధరణికిషోర్ తెలిపిన వివరాల మేరకు.. కొటంకకు చెందిన మోహన్‌బాబు తన సోదరునితో కలిసి రంగస్వామి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గతంలోనే తల్లి మరణించడం, తండ్రి కొటంకలో ఉండటంతో ఒంటరిగా ఫీలయ్యాడు. ఈనేపథ్యంలో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

బెలుగుప్ప : అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల చౌకబియ్యాన్ని శుక్రవారం స్థానిక నాగుల కట్ట వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా మూడో వాహనంలో చౌకబియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో బియ్యం తరలిస్తున్న కె.శేఖర్, కె.గోపీ, కె.అంజనేయులు, వడ్డే నాగార్జునను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా చౌకబియ్యాన్ని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

అనంతపురం క్రైం : గతనెల 11న నగరంలోని రామ్‌నగర్‌లో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు 4వ పట్టణ సీఐ ప్రతాపరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గతనెల 11న గొర్ల పెద్ద చంద్రశేఖర్‌నాయుడు, తన అన్న కొడుకు రాజగోపాలనాయుడుపై చాకుతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈనేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం రామ్‌నగర్‌లోని పవిత్ర మార్ట్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

పశుపోషణ లాభదాయకం : డిడి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పచ్చి గ్రాసం ద్వారా పశువులను పోషించడం ఎంతో లాభదాయకమని డిడి రమేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న పశుగ్రాస విత్తన ఉత్పత్తి క్షేత్రంలో పశు గ్రాస వారోత్సవాల కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు పచ్చిగ్రాసం వేయడం ద్వారా పాల ఉత్పతి పెరగడంతోపాటు పాల నాణ్యత పెరుగుతుందన్నారు. అంతేగాకుండా సరైన సమయంలో ఎదకు వచ్చి సక్రమంగా చూడు నిలుస్తుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుఉతుందన్నారు. పశు గ్రాస మేపులో 75 శాతం ధాన్యం జాతి గడ్డి, 25 శాతంకాయ జాతి గడ్డిని మేపితే పశువుల ఆరోగ్యం, ప్రత్యుత్పత్తి వ్యవస్థ సక్రమంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వై.సుబ్రమ్మణ్యం, బుక్కరాయసముద్రం సహాయ సంచాలకులు రత్నకుమార్, శిక్షణ సంస్థ ఎడి రామచంద్రారెడ్డి, పశుగ్రాస విత్తనోత్పత్తి క్షేత్రం ఎడి సుబ్రమణ్యం, పశువైద్యులు గోవిందరాజు, రాధిక, శ్రీకాంత్, పరిసర గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.


పచ్చిగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న డిడి రమేష్‌రెడ్డి

పవన్‌కళ్యాణ్ రాజకీయ అజ్ఞాని

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఓ రాజకీయ అజ్ఞాని అని రాజకీయాలపై అవగాహన లేకుండా, సమాజంపై బాధ్యత లేని వ్యక్తిగా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని నింబగల్లు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న వలంటీర్ వ్యవస్థను దెబ్బతీసేందకే టీడీపితో కుట్ర పన్ని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని ప్రముఖ సర్వేలన్నీ మరోసారి జగన్ సీఎం కావడం ఖాయమని చెబుతుండడంతో పవన్‌కళ్యాణ్ తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్నాడన్నారు. అందుకే ఏం మాట్లాడుతున్నాడో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా మెచ్చుకుని ఆదర్శంగా తీసుకుంటున్న వాలంటీర్ వ్యవస్థ గురించి చులకనగా మాట్లాడడం దారుణమన్నారు. ఈ సమావేశంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి చందా చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, పెన్నఅహోబిలం ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, సర్పంచి సునీత, ఎంపిటిసి ఈశ్వర్, పిఎసిఎస్ డైరెక్టర్ చిదంబరం నాయుడు, నాయకులు జెట్టి.రమేష్, ఓబులేసు, శివరాజు, హనుమప్ప, తదితరులు పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

'మిషన్ ఇంద్రధనస్సు'పై శిక్షణ

అనంతపురం : మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్లకు శుక్రవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ పుట్టిన ప్రతిబిడ్డకూ పూర్తిస్థాయి వ్యాధినిరోధక టీకాలు వేయడం మిషన్ ఇంద్రధనస్సు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా టిబి, కోరింత దగ్గు, ధనుర్వాతం, నిమోనియా, పోలియో, తట్టు, మెదడు వాపు తదితర వ్యాధులకు వ్యాక్సిన్లు వేసి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు చెన్నకేశవులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలెన్స్ అధికారి భవాని, మనోజ్, మహేంద్రనాథ్, శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ యుగంధర్

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

నార్పల : మండల పరిధిలోని దుర్గం గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది, వాలంటీరు, స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచి సాకే రామాంజనేయులు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వచ్చి 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్ శ్రీకాంత్, ఎఎన్ఎం ఫరీదాభాను, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేంద్ర, వాలంటీర్లు భాగ్యలక్ష్మి, ఉమాదేవి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన

నార్పల : మండల పరిధిలోని దుర్గం గ్రామంలో వైద్యసిబ్బంది శుక్రవారం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచి సాకే రామాంజనేయులు మాట్లాడుతూ సిఎం జగన్ వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే గ్రామస్థాయిలో విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కాగా మైక్రో బాక్టీరియా లెప్రి అనే బ్యాక్టీరియా నుంచి కుష్టువ్యాధి వ్యాపిస్తుందన్నారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, పొడలు, చేతులు, పాదాలు, కండరాలతో తిమ్మిర్లు అనిపించడం, నొప్పి అనిపించని పుండ్లు, కళ్లు పూర్తిగా మూసుకుపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఫరీదాభాను, విలేజ్ సర్వేయర్ శ్రీకాంత్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేంద్ర, ఆశాకార్యకర్త వీరనారాయణమ్మ, గ్రామస్తులు అగ్రహారం పెద్దన్న, శ్రీరాములు, మధు, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పుట్లూరు : మండల వ్యాప్తంగా పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి నిర్మలాదేవి, ఆలూరు విరాట్ శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు సర్పంచి రామిగాళ్ల ఓబులేసు, రవికుమార్, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఇఒఆర్‌డి ఆనంద్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష కేంద్రం తనిఖీ

అనంతపురం : జిల్లాకేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భూసార పరీక్ష కేంద్రంలో చేపట్టిన పరీక్షలను స్థానిక ఎడిఎ రోజా పుష్పలతను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌కు వచ్చిన మట్టి నమూనాలకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి నివేదికలు రైతులకు అందజేయాలని ఆదేశించారు. ల్యాబ్‌కు ఇప్పటికే సుమారు 15 వేల మట్టి నమూనాలను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమములో ల్యాబ్ ఏవోలు శేఖర్‌రెడ్డి, నాగేంద్ర, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

20న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

రాయదుర్గం : 2022-23లో ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన రాయదుర్గం పట్టణంలోని పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం ఈ నెల 19వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ సామాజిక వర్గం అధ్యక్షులు అరవ శివప్ప, ప్రధాన కార్యదర్శి చుంచుల నాగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'విద్యా దానం మహాదానం' పేరుతో ఈ నెల 20వ తేదీ స్థానిక భక్త మార్కండేయస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇస్తామన్నారు.

17న చౌడేశ్వరి జయంత్యుత్సవం

రాయదుర్గం : ఈ నెల 17వ తేదీ పట్టణంలోని నేసేపేటలో ఉన్న చౌడేశ్వరి ఆలయంలో చౌడేశ్వరి జయంత్యుత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ధర్మకర్త శ్రీరాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తొగటవీర క్షత్రియ విద్యా సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్దిలేటి ప్రభాకర తెలిపారు. విద్యార్థులు ఆదివారం లోపు మార్కుల జాబితా, ఆధార్ కార్డు నకలును అందజేయాలని సూచించారు.

కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ : ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సెయింట్ జోసెఫ్ ట్రైనింగ్ సెంటర్ ఎండి సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటి కౌన్సిల్ సెయింట్ జోసెఫ్ ట్రైనింగ్ సెంటర్ సహకారంతో మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆధార్, రేషన్, ఓటర్ ఐడి, కుల ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి మార్కుల జాబితాల నకలుతోపాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు. పూర్తి వివరాలకు గుంతకల్లు రోడ్డు వద్ద ఉన్న సెయింట్ జోసెఫ్ ట్రైనింగ్ సెంటర్‌లోగానీ, సెల్ నెంబర్లు 98859 75744, 96767 12514ను సంప్రదించాలని కోరారు.

కొళాయి మంజూరు చేయండి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

కొళాయి మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని చదం గ్రామానికి చెందిన భీమిరెడ్డి ఎంపిడిఒ కొండయ్యకు విజ్ఞప్తి చేశారు. తన ఇంటి ముందు పైపులైన్ వెళ్లినప్పటికీ కొళాయి వేసుకోకుండా అధికార పార్టీ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై 4 నెలల క్రితం జగనన్నకు చెబుదాం(1902)కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశానన్నారు. టిడిపి మద్దతుదారున్ని కావడంతో అధికార పార్టీ నాయకులు ఈ విషయాన్ని రాజకీయం చేస్తున్నారన్నారు. కొత్త కొళాయి కనెక్షన్ మంజూరు కోసం చలానా డబ్బులు కడతానని వచ్చినప్పటికీ పంచాయతీ స్థాయి అధికారులు దాట వేస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఎంపిడిఒ క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన కనెక్షన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతలక్ష్మి కళాశాల అధ్యాపకుడికి అభినందన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్సు విభాగం అధ్యాపకులు మురళీధర్ రచించిన కృత్రిమ మేథపై రాసిన పుస్తకాన్ని జెఎన్‌టియు విసి రంగజనార్ధన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్‌ను అభినందించారు. కంప్యూటర్ సైన్స్, కృత్రిమ మేథ, డేటాసైన్స్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా పుస్తకాలను ప్రచురించడం సంతోషకరమన్నారు. అనంతలక్ష్మి కళాశాల విద్యార్థులతో పాటు ప్రపంచంలోని అన్నిరంగాల విద్యార్థులకు ఈ పుస్తకం అందుబాటులో ఉండేటట్లు చూడాలని అనంతలక్ష్మి కళాశాల వైస్‌ఛైర్మన్ రమేష్‌నాయుడుకు సూచించారు. కళాశాల ఛైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ అనంత లక్ష్మి కళాశాల ఆచార్యులు మురళీధర్ కృత్రిమ మేథపై పుస్తకం ప్రచురించడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, వివిధ విభాగాల డైరెక్టర్లు సురేష్‌బాబు, ఈశ్వర్‌రెడ్డి, మాధవి, సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, అనంతలక్ష్మి కళాశాల ప్రిన్సిపల్ మూర్తిరావు ఖోకలే, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, వైస్ ప్రిన్సిపల్ రామమూర్తి, అకాడమిక్ డీన్ నాగసుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.


విసి రంగజన్ధానకు పుస్తకాన్ని అందజేస్తున్న అధ్యాపకుడు మురళీధర్

29 నుంచి రాజకీయ శిక్షణ తరగతులు


ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో ఈనెల 29, 30వ తేదీల్లో నిర్వహించనున్న ఐఎఫ్‌టియు రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, బి.సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రలు విడుదల చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు కమిటీ సభ్యులు రామాంజనేయులు, సత్తార్, గోపీ, బాషా, షేక్షావలి, నారాయణస్వామి, నారాయణ, జానయ్య, పట్టణ కార్యదర్శి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువ పరిశీలన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

చాగల్లు రిజర్వాయర్ నుంచి నిర్మించిన వరద కాలువను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద కాలువకు నీరు వదిలితే బోర్లతోపాటు పుష్కలంగా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా షేక్‌పల్లి, దిన్నె నామనాంకుపల్లి గ్రామాలకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. కావున కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

లైసెన్స్‌లను పునరుద్ధరించండి

లైసెన్స్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం

బ్లాక్ చేసిన లైసెన్స్ ఇంజినీర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని అనంతపురం లైసెన్స్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తమ మురళీకృష్ణ కోరారు. ఈమేరకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నూతనంగా విధుల్లో చేరిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలో అనధికారికంగా నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బ్లాక్ చేసిన లైసెన్స్‌ను రీవోక్ చేయాలని విన్నవించారు. అలాగే ప్రతి ఒక్కరూ కొత్తగా నిర్మాణం చేపడుతున్న బిల్డింగులకు సెట్ బాక్స్ మైంటైన్ చేసేలా చర్యలు తీసుకుని పట్టణాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఇడిఎఐ అధ్యక్షుడు తిరుపాల్, అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు చంద్రశేఖర్, జిల్లా ట్రెజరర్ విశ్వనాథ్, అసోసియేషన్ సభ్యులు రఫీ, రమేష్, జహీర్, సందీప్, రఫీక్ అహ్మద్, లక్ష్మీనారాయణ, షఫీ తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీకి వినతిపత్రం సమర్పిస్తున్న లైసెన్స్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఎస్సీ హాస్టల్ పక్కన ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుల వసతి గృహం పక్కనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మన్‌ను విద్యుత్ అధికారులు శుక్రవారం మార్చారు. కొద్ది రోజుల క్రితం హాస్టల్ పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్.. భయం గుప్పిట్లో విద్యార్థులు అన్న వార్త ప్రజాశక్తిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్తకు స్పందించిన విద్యుత్ అధికారులు ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసివేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చిన దృశ్యం

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల : మండల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ఉమా శంకరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శింగనమల ఐసిడిఎస్ పరిధిలోని రఘునాథపురం మినీ వర్కర్, విహెచ్ డిజేబుల్, అంగన్‌వాడీ హెల్పర్ (బిసి), గార్లదిన్నె-1 అంగన్‌వాడీ హెల్పర్ (ఒసి)కి కేటాయించినట్లు తెలిపారు. అర్హత ఉన్న వారు శింగనమల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అప్లికేషన్ ఫాంతోపాటు పదవ తరగతి మార్కుల జాబితా, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రం, స్థానిక ధ్రువీకరణ పత్రం, వితంతువులైతే వారికి సంబంధించిన పత్రాలు జతచేయాలని కోరారు.

కణేకల్లు : కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 5 అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ఎల్లమ్మ తెలిపారు. దేవగిరి-2(బిసి-ఎ), సింగేపల్లి-1(అంగవైకల్యం), హొన్నూరు-1(ఒసి), శ్రీధరఘట్ట-1(బిసి-బి), గెనిగెరి-2(ఎస్టీ) క్యాటగిరీలకు కేటాయించారన్నారు. ఇతర వివరాల కోసం కణేకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆపదలో ఉన్న మహిళకు రక్తదానం

శింగనమల : అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సమయంలో ఉన్న మహిళకు ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్యప్రకాష్ శుక్రవారం రక్తదానం చేశారు. అత్యవసరంగా రక్తం కావాలని తనకు ఫోన్ చేయడంతో వెంటనే స్పందించి సూర్యప్రకాష్ ఆసుపత్రికి చేరుకుని రక్తం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణం నిలబెట్టిన వారం అవుతారన్నారు. రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తం ఇవ్వడమే కాదు అవగాహన కల్పించి ఇతరులతో ఇప్పించడం కూడా గొప్ప విషయమే అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పరిధిలోని 49 డివిజన్ పరిధిలో డ్రై డే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు. ఇళ్లలో ఎవరికైనా జ్వరాలు ఉంటే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సచివాలయాల్లోని ఆరోగ్య సిబ్బంది మీ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఎవరైనా సీజనల్ వ్యాధులకు గురి అవుతున్నారా అని పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిశేఖర్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్‌రెడ్డి, హెల్తాఫీసర్ గంగాధర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

వృద్ధాశ్రమంలో అన్నదానం

తాడిపత్రి : శేఖర్, సునీత దంపతుల కుమారుడు కుషాల్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని అక్కన్నపల్లి గ్రామంలో ఉన్న రఘూన్సీ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఇందులో భాగంగా ఆశ్రమ నిర్వాహకులు జ్యోతిలత, ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, బీసీ ఓబులేసు, వరప్రసాద్, హుస్సేన్ బాషా, మాబూవలి తదితరుల ఆధ్వర్యంలో కేక్ కోసం పంచిపెట్టారు.

రజకులకు సబ్సిడీలు ఇవ్వాలి

గుంతకల్లు : రజక వృత్తిదారుల ఆర్థికాభివద్ధికి ప్రభుత్వాలు ప్రోత్సాహక సబ్సిడీలు ఇవ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో రజక సంఘ ం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ, మండల కార్యదర్శి రాముురాయల్, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, రజక సంఘం నాయకులు నీలకంఠ, నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరందించాలి

ఆత్మకూరు : నియోజకవర్గవ్యాప్తంగా ఆయకట్టుకి నీరు అందించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులూ ఎండిపోయే స్థితికి చేరుకున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీకాంత్, శివ, రామాంజనేయులు, ఓబులేసు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిద్దాం

ఉరవకొండ : బాధ్యతతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ, చీకులగురికి గ్రామాల్లోని సచివాలయాలు, పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి సచివాలయ పనిదినాల్లో తప్పకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, శ్రీనివాసులు, మర్రిస్వామి, ఉమాశంకర్, సురేష్ యాదవ్, అశోక్, లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాబు రాజేంద్రప్రసాద్‌రెడ్డికి సన్మానం

పెనుకొండ : వైసిపి సీనియర్ నాయకులు చల్లాపల్లి బాబు రాజేంద్రప్రసాద్‌రెడ్డికి శుక్రవారం రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ వాల్మీకుల సంక్షేమం కోసం నిత్యం శ్రమించిన పొగాకు రామచంద్రకి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల అరెస్టు హేయం

పుట్టపర్తి రూరల్: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారని పుట్టపర్తి జనసేన నాయకుల పై కేసులు బనాయించి అరెస్టు చేయడం హేయమైన చర్య అని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు చిలక మధుసూదన్ రెడ్డి ,జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, రాష్ట్ర నాయకులు పత్తి చంద్రశేఖర్ తదితరులు స్థానిక కోర్టు వద్ద అరెస్టు అయిన జనసేన నాయకులను పరామర్శించారు. సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పుట్టపర్తి పోలీసులు జనసేన నాయకుల పట్ల కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తున్నారని, వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. అంతకు ముందు రోజు వైసిపి నాయకులు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారని మరి వారి పైన ఎందుకు కేసులు బనాయించలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో పాటు ధర్మవరం టౌన్ కన్వీనర్ శ్యామ్, ప్రకాష్ రెడ్డి, పుట్టపర్తి నాయకులు బొగ్గరం శ్రీనివాసులు, కొత్తచెరువు బుక్కపట్నం జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి

ప్రజాశక్తి-గార్లదిన్నె

వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృషి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామేశ్వరి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయాధి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షం కురిస్తే జులై నెలాఖరి వరకూ వేరుశనగ, కంది పంటలు సాగు చేయవచ్చన్నారు. అదేవిధంగా ఆగస్టులో వర్షం వస్తే చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, కొర్ర, ఉలవ వంటి పంటల సాగుకు సిద్ధం కావాలన్నారు. చిరుధాన్యాల పంటలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎక్కువగా ఉందన్నారు. అదేవిధంగా క్రాప్ బీమా కూడా వర్తిస్తుందన్నారు. కాగా రైతులందరూ ఈనెల 25వతేదీలోపు పీఎం కిసాన్ కోసం ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ రవి, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఎంపిపి వెంకటనారాయణ, హార్టికల్చర్ ఆఫీసర్ ధనుంజయ, వెటర్నరీ డాక్టర్ రమేష్, ఎఇఒ స్రవంతి, వీహెచ్‌ఏ ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

అనంతపురం : ఖరీఫ్ సాగుకు రైతుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు ముంగిటకు చేర్చాలని అనంతపురం మండల వ్యవసాయ శాఖ అధికారిణి జె.శశికళ ఆదేశించారు. శుక్రవారం స్థానిక అనంత కృషీ భవన్‌లో ఛైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతుల పొలాల్లో మట్టి నమూనాల సేకరణ, సిసిఆర్ కార్డుల పంపిణీ, పి.ఎం కిసాన్ ఇకెవైసి, రసాయన ఎరువులు, వేరుశనగ విత్తనాలను పంపిణీ వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాగా కిసాన్ డ్రోన్ల కోసం ఆసక్తి ఉన్న రైతులు ఇంటర్మీడియట్ అర్హత కలిగి, పాస్‌పోర్టు కలిగి ఉన్న వారికి 12 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు అలేఖ్య, మురళీకృష్ణ, ప్రసాద్, మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామేశ్వరి

బుక్కరాయసముద్రం : ప్రస్తుతం విత్తేందుకు సమయం మించిపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో అధ్యక్షులు పెద్ద కొండయ్య అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున వేరుశనగ సాగుకు అదును సమయం మించి పోతోందన్నారు. ఈనేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. జడ్పిటిసి నీలం భాస్కర్ మాట్లాడుతూ కొంతమంది దళారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ వచ్చేటట్టు చేస్తామని డబ్బులు వాసులు చేస్తున్నారన్నారు. అలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. రైతుభరోసా కేంద్రం ఇన్‌ఛార్జిలు క్రాప్ బుకింగ్ చేయుంచుకుంటేనే పంట నష్ట పరిహారం, బీమా వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాంగోపాల్, చదుళ్ల సర్పంచి శ్రీనివాసరెడ్డి, సభ్యులు రుషింగప్ప, కొండారెడ్డి, దాసరి నారాయణస్వామి, రేకులకుంట లక్ష్మీనారాయణ, హార్టికల్చర్ అధికారిణి శైలజ, డ్రిప్ అధికారిణి హరిత, మార్క్ఫెడ్ మేనేజర్ పిన్నేశ్వరి, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఆదర్శ రైతులు, రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ఖరీఫ్ కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున రైతులు చిరుధాన్యాల పంటలపై దృష్టి సారించాలని గుత్తి ఎడిఎ వెంకటరాముడు సూచించారు. శుక్రవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు వర్షాలతో అరకొరగా సాగైన పత్తి పంట వర్షాలు రాకపోవడంతో ఎండుదశకు చేరుకుందన్నారు. కావున రాబోయే రోజుల్లో రైతులు చిరుధాన్యాలైన కొర్ర, జొన్న, రాగి, అలసంద, పెసర, వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సలహామండలి ఛైర్మన్ శరఖారెడ్డి, మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరి, సలహా మండలి సభ్యులు రైతులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

సిఎం జగన్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారంజక పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నేమితాబాదు, తురకపల్లి గ్రామాల్లో సర్పంచి ఎన్.సుందరమ్మ, ఎంపిటిసి సుమలత ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తురకపల్లిలో వైసిపి నాయకులు ఎమ్మెల్యేకు వినూత్నంగా స్వాగతం పలికారు. ఎద్దులబండిపై ఊరేగించారు. అనంతరం గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసమే సీఎం జగన్ నవరత్నాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సునీలాయాదవ్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరెడ్డి, హనుమంతురెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రంగస్వామిరెడ్డి, కుమార్, రవి, కౌన్సిలర్లు వరద, ఫారుక్, వాల్మీకి శివ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : మండలంలోని గన్నెవారిపల్లి-2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



ఎద్దుల బండిపై వస్తున్న ఎమ్మెల్యే వైవిఆర్.

నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన 4 ఏళ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందని వివరించారు. ముఖ్యంగా వాలంటీర్లు ఉదయాన్నే వెళ్లి పింఛన్లు అందజేసి ప్రజల మన్నలను పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమణమ్మ, ఎంపిటిసి సగర రవికుమార్, వైసిపి నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ రాయలసీమ' హామీ కరపత్రాలు విడుదల

పెనుకొండ : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఇచ్చిన 'మిషన్ రాయలసీమ' హామీ కరపత్రాలను శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి విడుదల చేశారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఎగువింటి శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులు నరేష్ యాదవ్, అంబులెన్స్ రమేష్, పుల్లప్ప చౌదరి, పార్లమెంట్ కమిటీ సభ్యులు జావీద్ బాషా, బళ్లారి సుధాకర్, కురుబ శ్రీధర్, శ్రీకంఠాపురం అంజి, భూమయ్యగారిపల్లి అంజి, యువతేజ, పెనుకొండ శ్రీనివాస్, గోరంట్ల మండల తెలుగు యువత సభ్యులు నరేంద్ర రాయల్, మణిశేఖర్‌రెడ్డి, భరత్, బాలకృష్ణ, ఐటిడిసి కార్తీక్‌యాదవ్, గుట్టూరు నాగరాజు, సానిపల్లి సూరి, కురుబవాండ్లపల్లి శేఖర్, అల్తాఫ్, జిరాక్స్ శీన, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కళ్యాణదుర్గం : పట్టణంలోని జోగుబండ వీధిలో మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి గోపాల్, పట్టణ కార్యదర్శి ఓంకార్ మాట్లాడుతూ కాలనీలో 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నా విద్యుత్, తాగునీరు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆర్డీఓ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. స్పందించిన ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డీఈఈలను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం వారు ఆర్డీఓ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

18న అధ్యాపకురాలి పోస్టుకు ఇంటర్వ్యూ

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్య కోర్సులో రెస్ట్ అధ్యాపకురాలి పోస్టుకు ఈ నెల 18వ తేదీ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి. బషీర్ అహమ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిఎస్సీ నర్సింగ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు మంగళవారం ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు 3 సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకొని కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.